

అతిసారతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-రేగిడి

రేగిడి మండలం అంబాడ పాఠశాలలో 1వతరగతి చదువుతున్న ముడిదాన కిరణ్ (6) బుధవారం అతిసారతో మృతి చెందాడు. రెండురోజులుగా అతిసార బాధపడుతున్నాడు. బుధవారం రాజాం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అందరితో సరదాగా ఉంటూ ఆటపాటలతో అరించిన విద్యార్థి అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు జోగి నాయుడు, సత్యవతి జీర్ణించుకోలేక పోతున్నారు.వీరికి ఇద్దరు కుమారులు కాగా, చిన్న కుమారుడు కిరణ్. విద్యార్థి మృతి పట్ల ఎంఇఒ మడిదాన వరప్రసాద రావు, పాఠశాల హెచ్ఎం ఎం.సత్యం నాయుడు, తోటి ఉపాధ్యాయులు విచారం వ్యక్తం చేశారు.



మృతి చెందిన కిరణ్

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలపై నిర్లక్ష్యం

- జిల్లాలో ఒక్క రుణమూ మంజూరు చేయని ప్రభుత్వం
- జిల్లా వ్యాప్తంగా 509 యూనిట్లు లక్ష్యం
- కేటాయింపులూ అరకొరగానే..

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఎస్‌సి, ఎస్‌టిలకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఆచరణలో నిలువెత్తు నిర్లక్ష్యం చూపిస్తోంది. ఎస్‌సిల స్వయం ఉపాధి కల్పించేందుకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు విషయంలో కూటమి ప్రభుత్వం చూపిస్తున్న వివక్షతే అందుకు నిదర్శనం. అధికారంలో వచ్చిన ప్రతి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికే కృషిచేస్తామని చెప్పడం తప్ప ఆచరణలో కానరావడం లేదు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్‌సిలకు సంబంధించిన ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేదు. ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాల మంజూరుకు దరఖాస్తులను ఆహ్వానిస్తారు .అందులో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024-25 సంవత్సరానికి సంబంధించి దరఖాస్తులను ఆహ్వానించింది. 509యూనిట్ల లక్ష్యంగా దరఖాస్తులు చేసుకోవాలని ఆహ్వానించారు. ఆన్‌లైన్ దరఖాస్తులను బిఆర్ అంబేద్కర్ జయంతి రోజున ఏప్రిల్ 14 నుంచి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపింది. చివరి తేదీ 2025 మే 10గా నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా 4048 మంది ఎస్‌సి యువతీ యువకులు రుణాల కోసం దరఖాస్తు చేశారు. అయితే ఇంతవరకు వాటికి సంబంధించి కనీసం ఎంపిక ప్రక్రియ చేపట్టలేదు. 509 యూనిట్ల గాను 2113 లక్షలుగా మొత్తం విలువ నిర్ణయించగా సబ్సిడీ రూ.832.64లక్షలు ఉంటుంది. బ్యాంకుల నుంచి రూ.1174.76 లక్షలుగా, లబ్ధిదారుని వాటా రూ.105.65 లక్షలుగా నిర్ణయించారు.

అరకొరగానే యూనిట్లు కేటాయింపు

జిల్లా వ్యాప్తంగా లక్షల్లో ఎస్‌సి జనాభా ఉంటే 509 యూనిట్లకు కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. లక్షల్లో ఉన్న జనాభాకు వందల్లో ఉన్న 509 యూనిట్లు ఎంత వరకు సరిపోతాయని ఎస్‌సి సామాజిక వర్గ నాయకులు ప్రశ్నిస్తున్నారు. యూనిట్ల సంఖ్యను పెంచి ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

రుణాలు మంజూరు చేయని ప్రభుత్వం

జిల్లా వ్యాప్తంగా ఎస్‌సి కార్పొరేషన్ కు రుణాల మంజూరుకు 4048 మంది ఎస్‌సి యువతీ యువకులు దరఖాస్తు చేసుకున్నారు వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక చేసిన జాబితాను బ్యాంకులకు పంపించాల్సి ఉంది. కానీ అటువంటి ప్రక్రియ ఏమీ తయారు చేయలేదు.

ఆదేశాలు రాగానే ఇంటర్వ్యూ నిర్వహిస్తాం

ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా 509 యూనిట్లకు 4048మంది దరఖాస్తులు చేసుకున్నారు .వీరందరికీ ఇంటర్వ్యూ లు నిర్వహించి అర్హులైన వారి పేర్లను బ్యాంకులో రుణాలు మంజూరుకు పంపిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఇంటర్వ్యూ లు నిర్వహించి బ్యాంకులకు పేర్లను పంపిస్తాం. ఇంకా దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం టైం ఇస్తుందో లేదో తెలియదు.

డి వెంకటేశ్వరరావు, ఇడి
జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంస్థ

మృతుల కుటుంబాలకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి - గజపతినగరం/ విజయనగరం ప్రతినిధి

మరుపల్లిలో అంతుచిక్కని వ్యాధులతో మరణించిన కుటుంబీకులను సిపిఎం నాయకుల బృందం బుధవారం పరామర్శించింది. గజపతినగరం మండలం మరుపల్లి గ్రామంలో రెండు నెలల వ్యవధిలో ఏడుగురు మరణించిన విషయం విధితమే. మరణించిన వారిలో సారికి రాము, మామిడి సత్యవతి, కె.లక్ష్మీనాయుడు, జి.జయలక్ష్మి, జి.పరదేశి, పి. అప్పలస్వామి, కునుకు సత్యవతి ఉన్నారు. వీరంతా వారం లేదా పది రోజుల తేడాతో రెండు నెలల్లో చనిపోవడంతో గ్రామంలో భయానక వాతావరణం నెలకొంది. ఈ పరిణామంపై ఈనెల 9వ తేదీన 'ఆగ్రామానికి ఏమైంది' అంటూ ప్రజాశక్తిలో ప్రత్యేక కథనం వెలువడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ గ్రామాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ నాయకత్వంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ, వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. మరణాలకు గల కారణాలను ఆయా కుటుంబ సభ్యులను అడిగి తెలుసు కున్నారు. దాదాపు ఎక్కువ మంది జ్వరంలో లేదా శ్వాసకోశ సమస్య ఉత్పన్నమైన ఒకటి లేదా రెండు రోజుల్లోనే చనిపోయినట్టుగా చెప్పారు. జర్వం, శ్వాసకోశ ఇబ్బందులతో అప్పటి కప్పుడే మరణించారంటూ బాధితులు కన్నీటి పర్యాంత మయ్యారు. ధైర్యంగా మిగిలిన కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని పరిరక్షంచు కోవాలని బాధితులకు సిపిఎం నాయకులు నచ్చజెప్పారు. అనంతరం పిహెచ్‌సిలోని డాక్టర్ సాయి కృష్ణారెడ్డి, గ్రామ సచివాలయంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి మంత్రి రమణలతో సిపిఎం నాయకులు చర్చించారు. మరణాలకు గల కారణాలను ప్రభుత్వం అన్వేషించాలని, ఉన్నధికారులు స్పందించి ప్రత్యేక వైద్య బృందాన్ని గ్రామంలోకి పంపాలని సూచించారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని కొనసాగించడంతోపాటు అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని అన్నారు. గ్రామంలో అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, ఎఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి సలహాలు, సూచనలు ఇవ్వడం అభినంద నీయమన్నారు. గ్రామంలోని గ్రీన్ అంబాసడర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయడంతోపాటు గ్లౌజులు, మాస్కులు, సబ్బులు, యూనిఫారం వంటివి కిట్లను అందజేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా గ్రామంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యాన ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ జీవనరాణి కూడా గ్రామాన్ని సందర్శించారు. ఇప్పటికీ గ్రామంలో జ్వర పీడితులు ఉన్నారు. తీవ్ర జ్వరంతో వణికిపోతున్న నారాయణమ్మ అనే మహిళను కూడా స్థానిక పిహెచ్‌సి వైద్యులు గజపతినగరం ఏరియా ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు.



పిహెచ్‌సి వైద్యాధికారితో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు



జ్వరంతో బాధపడుతున్న మహిళకు ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది



మాధవరాయ మెట్ట వద్ద క్వారీని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు, కాలనీ వాసులు

క్వారీని పరిశీలించిన సిపిఎం బృందం

12న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి -శృంగవరపుకోట

స్టోన్ క్రషర్ కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో జామిలోని మాధవరాయమెట్ట కాలనీని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ పరిశీలించారు. ఇప్పటికే పది మందికి పైగా కిడ్నీ వ్యాధి బారిన పడి చనిపోయారని, మరో 10 మంది వ్యాధితో బాధపడుతున్నారని కాలనీ వాసులు సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై తమ్మినేని మాట్లాడుతూ కాలనీ చివరి ఇంటికి పది అడుగుల దూరం కూడా లేకుండా భారీ స్టోన్ క్రషర్ నడవడం కాలుష్య నియంత్రణ అధికారులకు పట్టకపోవడం దుర్మార్గమన్నారు. సమస్యల పరిష్కారానికి కాలనీ వాసులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది బూసర్ల రమణారావు, కాలనీవాసులు పాల్గొన్నారు

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 13న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత సూచించారు. బుధవారం విజయనగరం , పార్వతీపురం మన్యం జిల్లాలలోని న్యాయ మూర్తులు అందరితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద భీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు , ఎగ్జిక్యూషన్ పిటిషన్ ,ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సైజ్ కేసులు, ల్యాండ్ కేసులు, కుటుంబ తగాదాలు ,వాటర్ కేసులు, మున్సిపాలిటీ కేసులు ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారం చేయాలని తెలిపారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. మీనాదేవి, ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎమ్ .పద్మావతి, పోక్సో కోర్ట్ జడ్జి కె.నాగమణి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి. దుర్గయ్య, డిఎల్ఎస్ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ఘనంగా సిమ్స్ చర్చి 150 వసంతాల వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి 150 వసంతాల వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వందలాదిగా తరలివచ్చిన క్రైస్తవ భక్తులతో చర్చి ఆవరణలో జయ జయ ధ్వానాలతో వేడుకల ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజమండ్రి బిషఫ్ ఆర్థర్ ప్రసాద్ ప్రార్థన చేస్తూ 150 వసంత వేడుక జ్ఞాపిక పలకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆలయంలో క్రైస్తవ మహాసభలను ప్రార్థనతో ప్రారంభించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే పూసపాటి అధితి గజపతిరాజు ముఖ్య అతిథిగా హాజరై సిమ్స్‌చర్చితో తనకున్న అనుబంధాన్ని వివరించారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే విజయనగరంలో సిమ్స్ చర్చ్ స్థాపించి 150 ఏళ్ళ పూర్తి కావడం సంతోషాన్ని కలిగిస్తుందని అన్నారు. సిమ్స్ స్థాపన ద్వారా విద్యాభివద్ధి కూడా జరిగి ఇక్కడి మిషనరీ పాఠశాల ద్వారా వేల మంది భావి భారత పౌరులు తీర్చిదిద్దబడ్డారని ప్రశంసించారు. అనంతరం ముఖ్య ప్రసంగీకులుగా రాజమండ్రి నుంచి విచ్చేసిన జాన్ వెస్లీ మహాసభలనుద్దేశించి ఉజ్జీవకరమైన వాక్య సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో వై.ప్రభాకర్, సిమ్స్ జూబ్లీ కమిటీ చైర్మన్ ఎంఎ నాయుడు, సెక్రటరీ టి.ఆనందరావు, ట్రెజరరీ జి.సుగుణాకరరావు, కన్వీనర్ ఆర్ఎస్ఎ కుమార్, వర్షిప్ లీడర్ ఆర్ఎస్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 27నుండి 29వ తేదీ వరకు ఏలూరు జిల్లాలో గల ఎఎస్ఆర్ స్టేడియంలో జరగబోవు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక ఈనెల 13 తేదీ ఉదయం 8గంటల నుంచి విజ్జీస్టేడియంలో జరుగుతాయని అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధి లీలాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు 14,16,18,20 సంవత్సరాల బాలురు, బాలికలకు రన్స్, త్రోస్, జంప్స్‌లో జరుగుతాయన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే 16ఏళ్ల లోపు వారు బర్త్ సర్టిఫికెట్ లేదా తహశీల్దార్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని తెలిపారు. ఆధార్ అడ్రస్ ఉమ్మడి జిల్లా అడ్రస్ అయి ఉండాలన్నారు.

రెండు రోజుల్లో 1200 మెట్రిక్ టన్నుల యూరియా

ప్రజాశక్తి-విజయనగరంకోట



రైతులు నానో యూరియాను ఎక్కువగా వినియోగించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సూచించారు. రెండో విడతగా నానో యూరియాను వినియోగిస్తే మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. బుధవారం నిర్వహించిన డయిల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి గుర్ల, బొబ్బిలి, మెరకముడిదాం, వంగర నుంచి నలుగురు రైతులు ఫోన్ చేశారు. జిల్లా కలెక్టర్‌కు తమ సమస్యలను తెలియజేశారు. పొలాలకు రెండో దఫా జల్లేందుకు యూరియా కావాలని వీరు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 200 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. జిల్లాకు ఐపిఎల్ కంపెనీ నుంచి కేటాయించిన 700 మెట్రిక్ టన్నులు మార్గమధ్యలో ఉందని, ఒకటి రెండు రోజుల్లో జిల్లాకు చేరునుందని తెలిపారు. రైలు మార్గం ద్వారా కాకినాడ నుంచి ఇంకొక 500 మెట్రిక్ టన్నులుప రెండు మూడు రోజుల్లో జిల్లాకు వస్తుందని తెలిపారు. రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని కోరారు. జిల్లాలో 12 వేల నానో యూరియా బాటిల్స్ వివిధ మండలాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

డయిల్ యువర్ కలెక్టర్ వాయిదా

రైతులకు తగినంత యూరియా జిల్లాలో అందుబాటులో ఉందని, పంపిణీ కూడా సక్రమంగా జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. యూరియా సరఫరాలో సమస్యలు తగ్గాయని, డయిల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి ఫోన్ చేసేవారి సంఖ్య కూడా తగ్గిందని పేర్కొన్నారు. అందువల్ల డయిల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని గురువారం నుంచి తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

61 మంది జిల్లా యాత్రికులు సురక్షితం

కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లా నుంచి మానస సరోవర యాత్రకు నేపాల్ వెళ్లిన 61 మందీ క్షేమంగా ఉన్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలిపారు. వీరిని సురక్షితంగా జిల్లాకు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రికులతో జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత స్వయంగా మాట్లాడి యోగక్షేమాలను తెలుసుకున్నారని, వారిని రప్పించేందుకు చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఖాట్మండులో చిక్కుకుపోయిన వారిని సురక్షితంగా మన రాష్ట్రానికి రప్పించేందుకు రాష్ట్ర మానవ వనరుల శాఖామంత్రి లోకేష్ ప్రయత్నం చేస్తున్నారని, ఆర్టీజిఎస్ ద్వారా నిరంతరం ఆయన పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. మంత్రి లోకేష్‌కు జిల్లా యాత్రికులు 61 మంది జాబితాను పంపించామని తెలిపారు. యాత్రికులను ఖాట్మండ్ నుంచి గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక విమానంలో రాష్ట్రానికి తీసుకురానున్నారని, వారి బంధువులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ కోరారు.

కౌశలం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పిస్తోందనినగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఇంట్లోనే ఉంటూ ఉద్యోగం చేసుకునేలా కార్యాచరణ రూపొందించిందని, ఇందుకోసం 'ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగ అభ్యర్థులను గుర్తించి విద్యార్హతకు తగినట్లుగా ఉపాధి కల్పించడం, కంప్యూటర్, ల్యాప్టాప్, సెల్ఫోన్ ద్వారా ఇంట్లోనే ఉంటూ వర్క్ ఫ్రం హోం ఉద్యోగాలు చేసుకునే అవకాశం. యువతలో నైపుణ్యాలను పెంపొందించడం దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, డిప్లొమో, ఐటీఐ వంటి కోర్సులు చేసిన అభ్యర్థులను అర్హులుగా ప్రకటించిందని, ఇందుకు కౌశలం సర్వే ప్రారంభించిందని తెలిపారు. అభ్యర్థులే సొంతంగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకునేలా (కంప్యూటర్, ల్యాప్టాప్‌లో) అవకాశం కల్పిస్తూ.. https://gsws-nbm.ap.gov.in/BM వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. నిరుద్యోగులకు కౌశలం ఓ చక్కని సువర్ణావకాశం అని కమిషనర్ తెలిపారు.

ఆత్మహత్యలను నివారించాల్సిన బాధ్యత అందరిది

ప్రజాశక్తి కంటోన్మెంట్

ప్రతి జీవితం విలువైనదని, ఆత్మహత్యలను నివారించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ బి.దేవి మాధవి అన్నారు. బుధవారం ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల మానసిక విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ బోధనాసుపత్రి ప్రాంగణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మహత్యపైమౌనం కాదు- మార్పు అవసరం, ఆత్మహత్యపై మన దృక్పథాన్ని మార్చుకుందాం అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ దేవిమాధవి, సూపరింటెండెంట్ పద్మజ మాట్లాడుతూ ఆత్మహత్య ఆలోచనలు, భావోద్వేగ సమస్యలు మొదలగువాటిని ప్రారంభదశలో గుర్తించడం ఎంతముఖ్యమో వివరించారు. ప్రతీఒక్కరూ రోజూవారి జీవితంలోఎదురయ్యే ఒత్తిడిని తగ్గించుకోవడానికి సరైన మార్గాలను అవలంభిస్తే మానసి క సమస్యలు అధిగమించవచ్చని అన్నారు. సమాయానికి గుర్తించి చికిత్స చేయడంద్వారా అనేకమంది ప్రాణాలను రక్షించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎంఒ కామేశ్వరరావు, వైద్యులు డాక్టర్ జయశ్రీ, డాక్టర్ గాయత్రి, నిరంజన్, పాల్గొన్నారు.



ఆస్పత్రి వద్ద ర్యాలీ అవగాహన నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు

పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్పొరేషన్ పరిధి ధర్మపురిలో సర్వేనెంబరు 86/1, 2, 3, 4, 5లో గయాలుకు చెందిన ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని పట్టణ బడుగు బలహీన వర్గాలు సంక్షేమ సంఘం నాయకులు రెడ్డి నారాయణరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007 నుండి రిజిస్ట్రేషన్ నిలుపుదల చేసి అమ్మినవారికి, కొన్నవారికి నోటీసులు ఇచ్చారని తెలిపారు. మొదటి జాబితాలో అర్హులుగా గుర్తించిన 45 మందితో పాటు ఒకే కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ములు ఉన్నవారికి, నిజమైన అర్హులకి ఎంపిక చేయాలని కోరారు.



యూరియా కోసం ఆర్‌బికె వద్ద బారులు తీరిన రైతులు

యూరియా కోసం బారులు

ప్రజాశక్తి- సంతకవిటి

విజయనగరం జిల్లా సంతకవిటి మండలంలోని సిరిపురంలోని యూరియా కోసం రైతులు బారులు తీరారు. బుధవారం 220 యూరియా బస్తాలు రైతు సేవా కేంద్రానికి రావడంతో రైతులు పరుగులు తీశారు. రైతులు ఎక్కువగా రావడంతో ఎఒ సి.బి యశ్వంత్ రావు పోలీసుల సమక్షంలో పంపిణీ చేశారు. రైతులు ఎండలో గంటలతరబడి పడిగాపులు కాయడంతో ఇబ్బందులు పడ్డారు. యూరియా అందకపోవడంతో కొంతమంది రైతులు చివరికి నిరాశ చెందారు. రోజుల తరబడి యూరియా కోసం చూసినా ఉపయోగం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిపురంలోని రైతు సేవా కేంద్రం ఓ ప్రైవేటు భవనంలో ఇరుకు గదుల్లో కొనసాగించడంతో రైతులు ఇక్కట్లు పడ్డారు. విశాలవంతమైన ప్రభుత్వ భవనం నిర్మాణం పూర్తి అయినప్పటికీ ప్రారంభం కాలేదని రైతులు విమర్శిస్తున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పట్టణానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సుధా కుమారి పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్‌విఎన్ హోటల్‌లో బుధవారం రోటరీ సెంట్రల్ క్లబ్ బాలలకు నిర్వహించిన విచిత్ర వేషధారణ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏదైనా సాధించాలనే తపన బాల్యం నుంచే అలవర్చుకోవాలని సూచించారు. పట్టణంలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 156 విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రోటరీ సెంట్రల్ క్లబ్ అధ్యక్షులు విజయకుమార్ అగర్వాల్, కార్యదర్శి ఉదయ్ కుమార్, కార్యక్రమం చైర్మన్ దినేష్ , ప్రతినిధులు శశి కుక్రేజ, యూత్. సర్వీస్ డైరెక్టర్ రోహిత్ సంజయ్, కృష్ణతేజ, చెన్నాప్రదీప్, ఆర్.శంకర్ రెడ్డి, అశోక్, జయకృష్ణ, టి.ఎల్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ మేధావి సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఎం పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి దేశం గర్వించదగిన మేధావి అని నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. ఏచూరి ప్రథమ వర్ధంతి సభ బుధవారం గురజాడ నగర్‌లో జరిగింది. ముందుగా సిపిఎం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి. రమణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శంకరరావు మాట్లాడారు. దేశంలో సోషలిజం సాధన కోసం జీవించి నంత కాలం నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి ఉన్న మహా నేత ఏచూరి అని కొనియాడారు. మతోన్మాద ప్రమాదంపై రాజ్యాంగ పరిరక్షణ కోసం అలుపెరుగని పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం, శ్రామిక రాజ్య సాధన కోసం పోరాటం చేయడమే ఏచూరికి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు రంభ శ్రీనివాస రావు పాల్గొన్నారు.



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, గురజాడ నగర్ వాసులు

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంటువ్యాధులు ప్రబల కుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. ఈ మధ్య కురిసిన వర్షాల వల్ల అక్కడక్కడా నీరు నిల్వ ఉంటోందని, దీనివల్ల దోమలు వృద్ధి చెంది అంటువ్యాధులు ప్రబలడానికి కారణంగా నిలుస్తోందని అన్నారు. దీంతో యాంటీ లార్వా ఆపరేషన్లను ముమ్మరం చేయాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. జ్వర పీడిత ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం నాడు డ్రైడే ను విధిగా పాటించాలని చెప్పారు.

కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన

వేపాడ: మండలంలోని సోంపురం ఎస్సి కాలనీలో ఇంటింటి కుళాయి నిర్మాణానికి జిల్లా పరిషత్తు నిధులు రూ.6లక్షలతో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముసిరిపిండి గంగరాజు, ఎంపిటిసి ఆకుల సత్తిబాబు, అరిగిపాలెం ఎంపిటిసి సింహాద్రిరావు వెంకటరమణ, మండల యువత అధ్యక్షులు ఉగ్గిన శ్రీను, వైస్ సర్పంచ్ సత్యారావు, నాయకులు మళ్లేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి తదితరులు పాల్గొన్నారు.

పింఛను ఇప్పించండి మహా ప్రభో!

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని ఎస్సి కాలనీకు చెందిన మారడ బూడి అప్పారావు తనకు వృద్ధాప్య పింఛను ఇప్పించాలని బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఇంచార్జి ఎఒకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ తనకు 75 ఏళ్ల ఉంటాయని, కానీ ఆధార్ కార్డులో వయస్సు తక్కువగా ఉండటంతో పింఛను ఇవ్వడం లేదని చెప్పారు. తాను తన భార్య ఉంటున్నామని తమకు పనిచేయడానికి ఆరోగ్యం కూడా సహకరించడం లేదని దీంతో కుటుంబ పోషణ కష్టతరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదని కనీసం తాను చనిపోయిన తరువాతైనా తన భార్యకు వితంతు పింఛను వచ్చేలా చూడాలని వేడుకున్నారు. స్పందించిన ఎఒ ఎంపిఎ ద్వారా ఆధార్ కార్డు, ఓటర్ కార్డు పరిశీలించి పింఛను వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు.

ఎస్సి వర్గీకరణను వెనక్కి తీసుకోవాలి

కొత్తవలస: మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం పిలుపు మేరకు ఆరోపిత విజయనగరం జిల్లా అధ్యక్షులు దేదేటి దేముడు ఆధ్వర్యంలో ఎస్సి వర్గీకరణను వెనక్కి తీసుకోవాలని కోరుతూ బుధవారం స్థానిక జంక్షన్ కూడలిలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దాసరి చెన్నకేశవులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సిలకు వ్యతిరేకమని వెంటనే ఎస్సి వర్గీకరణ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ విషయంలో ప్రభుత్వం మోసం చేసిందంటూ కొత్తవలస జంక్షన్ కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కొత్తవలస మండలం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

వేపాడ: మండలంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఆయా పాఠశాలల్లో బుధవారం ఘనంగా సత్కరించారు. కెజిబివి ఉపాధ్యాయులు రోహిణి, మారిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు టి.రాంబాబు, బొద్దాం ప్రాథమిక పాఠశాలకు చెందిన బి.అరుణకర్, కెజిపూడి జెడిపిహెచ్ఎస్ పాఠశాలకు చెందిన ఎ.శ్రీనివాసరావులను ఎంఇఓల తరుపున ఘనంగా సత్కరించారు. మారిక ఎస్ఎంసి తాడి రాంబాబును కరకవలస సర్పంచ్, ప్రధానోపాధ్యాయులు రమేష్, విద్యాకమిటి చైర్మన్, గ్రామస్తులు విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

శృంగవరపు కోట: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు పి. స్వప్నను పాఠశాల ఆవరణలో హెచ్ఎం పివి రాంకుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు బుధవారం ఘనంగా సన్మానించారు.ఉపాధ్యాయులు రహీం షేక్ లాల్, బంగారు నాయుడు, స్టాఫ్ సెక్రటరీ వర్రి భాస్కరరావు, విశ్వనాథం, చిప్పాడ శ్రీను, గోపీ, డివి సూర్యనారాయణ, ఉగ్గిన శ్రీను, పి భాస్కర్, సింహాచలం నాయుడు, తీడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

చీపురుపల్లి: ప్రజలు సుభిక్షంగా ఆనందంగా ఉండాలని ఎంపిపి వెంకట నరసమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, ఉప సర్పంచ్ బెల్లాన శ్రీదేవి అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి ఆకుల పేటలో జెడ్‌పిటిసి నిధులు రూ.2లక్షలతో మంజూరైన బోరుబావి పనులను వారు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలన్న ఆలోచనతో గ్రామాలలో మౌలిక వసతులు కల్పన ధ్యేయంగా తాము పని చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఆకులపేటలో బోరుబావిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మీసాల వరహాల నాయుడు, స్థానిక ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై ఆడిట్

రేగిడి: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో 39 గ్రామపంచాయతీలకు సంబంధించి నిధులు వినియోగంపై సీనియర్ ఆడిటర్లు కెపి గిరి, ప్రశాంత్ కుమార్ బుధవారం ఆడిట్ నిర్వహించారు. 2024 -25 ఏడాదికి సంబంధించి ప్రభుత్వం నుంచి జమైన వివిధ రకాల పద్దుల కింద వచ్చిన నిధులు, ఖర్చులు, జమలు ఇతర వినియోగం పై ఆడిట్ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. వీరితో గోపాల్, జగదాంబ ఉన్నారు.

'సంకల్పం' పై అవగాహన

గరివిడి: మండలంలోని కొండదడి ఎంపియుపి పాఠశాలలో ఎస్‌హెచ్ గ్రూప్, ఆరోగ్య సిబ్బంది, తల్లిదండ్రులకు సంకల్పం కార్యక్రమంపై బుధవారం అవగాహన కల్పించారు. ఐసిడిసి సిడిపిఒ ఎన్ ఆరుద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు వాటి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఆనందరావు, సూపర్‌వైజర్ ఎం. జ్యోతి, గ్రామ సర్పంచ్ ఎం. గౌరమ్మ పాల్గొన్నారు.

సొంత నిధులతో రహదారి పనులు

రామభద్రపురం: శ్రమదానం, సొంత నిధులు వెచ్చించి జాతీయ రహదారిపై గుంతలు పూడ్చడానికి సిద్ధపడిన పోలీసు సేవలకు ప్రజలు శభాష్ అంటున్నారు. ఆర్అండ్‌బి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉదాసీనంగా ఉండడంతో వారు చేయాల్సిన విధి నిర్వహణను ప్రజా శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రసాదరావు, పోలీసులు మండల కేంద్రం నుంచి రాజాం వెళ్ళే జాతీయ రహదారి వద్ద సుమారు 2 కిలోమీటర్ల మేర ఏర్పడ్డ పెద్ద పెద్ద గుంతలు పూడ్చే పనులు బుధవారం చేపట్టారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు మిగతా ప్రాంతాల్లో తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు

శాంతి కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలి

నెల్లిమర్ల: మండలంలోని సతివాడ గ్రామంలో శాంతి కమిటీని ఏర్పాటు చేయాలని జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటర్ కమిటీ సభ్యులు పి. చిట్టిబాబు కోరారు. ఆ గ్రామంలో ఎస్సిలు వినాయకుని విగ్రహ నిమజ్జనాన్ని బిసిలు అడ్డుకోవడంపై ఆయన బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఉపయోగించుకునే బహిరంగ దారిలో వెళ్లకుండా నిరాకరించడం, ఊరేగింపుగా వెళుతున్న వారిని ఆటంకపరచడం, వివిధ సాంఘిక బహిష్కరణ చర్యలు చేపట్టడం చట్టరీత్యా నేరమని చెప్పారు. అట్రాసిటి చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా అధికారులు గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాలకు చట్ట ప్రకారం సహాయం అందించాలన్నారు. ఆయన వెంట బసవ సూర్యనారాయణ ఉన్నారు.

సతివాడ దళితులకు రక్షణ కల్పించాలి

సతివాడ దళితులకు రక్షణ కల్పించాలని జైభీం భారత్ పార్టీ నాయకులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం వారు సతివాడ దళిత వాడను సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ నిమ్మజనంలో దళితులను బిసి వర్గాలు అడ్డుకోవడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం దళితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఇండియా మిషన్ బి. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- శృంగవరపు కోట

మండలంలోని బొడ్డవర వద్ద జిందాల్ కంపెనీకి భూములు ఇచ్చి తామంతా మోసపోయామని జనరల్ కంపెనీకి ఇచ్చిన భూములను తిరిగి ఇవ్వాలని గత 80 రోజులుగా జిందాల్ నిర్వాసితులు ధర్నాలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం స్పందించకపోవడంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, నిర్వాసితులు పాల్గొన్నారు.



ఢిల్లీలో ధర్నా చేస్తున్న నిర్వాసితులు

మున్సిపల్ అభివృద్ధికి రూ.2 కోట్లు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలి మున్సిపాలిటి అభివృద్ధికి రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ రూ.2కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే బేబినాయన చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ శరత్‌తో కలిసి మంత్రి నారాయణను కలిసి కోరినట్లు చెప్పారు. పట్టణ సమస్యలను మంత్రికి వివరించడంతో స్పందించిన మంత్రి రూ.2కోట్లు మంజూరు చేసి మున్సిపల్ ఖాతాకు జమ చేశారని చెప్పారు. కాలువలు నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారని, ఆయన సూచనలతో కాలువలు నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. పట్టణ ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు అందించేందుకు సీతానగరం సువర్ణముఖి నది నుంచి పైపులైన్ వేసేందుకు గతంలో రూ.90కోట్లు మంజూరు అయితే వైసిపి ప్రభుత్వం పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహించడంతో తాగునీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే స్కీమ్‌ని రూ.30కోట్లు అదనంగా మంజూరు చేసి కేంద్ర ప్రభుత్వం టెక్నికల్ అనుమతులు ఇచ్చిందని చెప్పారు. నిధులు మంజూరు చేసిన మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, కమిషనర్ రామలక్ష్మి ఉన్నారు.



ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

మున్సిపల్ సిబ్బందికి ఎమ్మెల్యే అభినందనలు

పాత టైర్లు, పనికిరాని ప్లాస్టిక్ డబ్బాలతో పువ్వులు కుండీలు తయారు చేసి మొక్కలను పెంచుతున్న మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మిను, సిబ్బందిని ఎమ్మెల్యే బేబినాయన అభినందించారు. ప్లాస్టిక్ నిషేధానికి పని చేయాలని సూచించారు. పాతటైర్లలో కోటలో కూడా మొక్కలు పెంచుతామని బేబినాయన చెప్పారు.

పిరిడి పిహెచ్‌సి సందర్శన

బొబ్బిలిరూరల్ : మండలంలోని పిరిడి పిహెచ్‌సిని బుధవారం ఎమ్మెల్యే బేబీనాయన ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లతో మాట్లాడి ఆసుపత్రిలో సదుపాయాలు, చికిత్సా విధానాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం, ఆసుపత్రి డాక్టరు వంశీతో మాట్లాడి, ఆసుపత్రి అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా తనకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా వైద్యులు వంశీ మాట్లాడుతూ వైద్య శాలలో సుమారు 93 మంది సిబ్బంది ఉన్నారని, ఈ ఆసుపత్రికి ఒక మీటింగ్ హాల్ అవసరమని, అందులో ప్రతివారం, ప్రతి నెలా జరిగే సమావేశాలకు సిబ్బంది శిక్షణలకు అదనపు గది అవసరం ఉందని ఎమ్మెల్యేకు తెలిపారు. ప్రతి నెలా 9వ తేదీన గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, అందుకు కూడా ఆ మీటింగు హాలు ఉపయోగించుకోవచ్చు అని అన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి, వీలైనంత త్వరగా మీటింగ్ హాలు నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అట్టహాసంగా జిల్లా స్థాయి సెపక్ తక్రా పోటీలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని అలుగోలు జడ్‌పి ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సెపక్ తక్రా పోటీలకు బుధవారం ఎంపికలు జరిగాయి. సెపక్ తక్రా అనే క్రీడాంశంపై జిల్లాస్థాయి అండర్ 14, అండర్ 17, అండర్ 19 బాలికలు, బాలురు విభాగంలో జిల్లాస్థాయి ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.కస్తూరి ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. ఈ పోటీలకు అలుగోలు, సతి వాడ మోడల్ స్కూల్, రామతీర్థం, తంగుడు బిల్లి, విటి అగ్రహారం, జామి, చింతపల్లి, విజయనగరం, అక్కివరం పాఠశాలకు చెందిన 30 మంది బాల, బాలికలు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వీరంతా రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని పీడీ సూర్యారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు జి.ధర్మారావు, బి. మహేష్ రావు, రామతీర్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సిరియాల సూర్యారావు, జామి నుంచి యుఎస్ ఆనందరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని పనసలవలస హైస్కూల్‌లో ఈ నెల 11, 12 తేదీలలో మండల స్థాయి అండర్ 14, 17 విభాగాల్లో విద్యార్థులకు వేర్వేరుగా స్కూల్ గేమ్స్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ వరప్రసాదరావు, మండల క్రీడాధికారి ఎన్. సత్యనారాయణ తెలిపారు. కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, బాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ వంటి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్కొక్క పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు క్రీడలకు వచ్చేలా ఇప్పటికే పాఠశాలల హెచ్ఎంలకు ఆదేశాలు అందించామన్నారు. వీరితోపాటు ప్రధానోపాధ్యాయులు బి.సునీత, వ్యాయామ ఉపాధ్యాయులు కె. కోటి చక్రదర్ ఉన్నారు.

ఘనంగా మండల స్థాయి క్రీడా పోటీలు

సంతకవిటి: మండల స్థాయి స్కూల్ గేమ్ సెలక్షన్స్ కమ్ టోర్నమెంట్ సంతకవిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, కోకో, చెస్,



నెల్లిమర్ల సెపక్ తక్రాలో పాల్గొన్న క్రీడాకారులు

బ్యాడ్మింటన్, యోగా అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఈ ఎంపిక పోటీల్లో మండలంలో ఉన్న వివిధ పాఠశాలల నుండి క్రీడాకారులు పాల్గొని తలబడ్డారు. గెలిపొందిన క్రీడాకారులకు జోనల్ స్థాయి పోటీలకు పంపిస్తామని వ్యాయామ ఉపాధ్యాయులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ1 బి.శాంతి కుమారి, ఎంఇఒ 2 భాస్కర్ రావు, ప్రధానోపాధ్యాయులు ఎం.సాయిశ్వరి, వ్యాయామ ఉపాధ్యాయులు కె. భుజంగరావు, శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై దృష్టి

ప్రజాశక్తి- గంట్యాడ

జిల్లా వ్యాప్తంగా బాల్యవివాహాలు జరగకుండా నిర్మూలన చేయడానికి దృష్టి సారిస్తున్నామని ఐసిడిఎస్ పీడీ టి.విమల రాణి అన్నారు. బుధవారం గంట్యాడలోని అంగన్‌వాడి కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించడానికి గ్రామస్థాయి నుండి సచివాలయ స్థాయి మండల స్థాయి జిల్లా స్థాయిలలో కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి అంగన్‌వాడి కేంద్ర సిబ్బంది స్థానిక ప్రభుత్వ అధికారులు గ్రామ సర్పంచ్‌తో పాటు నాయకులు గ్రామంలోని పరిశీలన చేసి బాల్యవివాహాలపై మండల స్థాయి కమిటీ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కొత్త మొబైల్‌ను త్వరలో అందిస్తామన్నారు. పిల్లలు ఎత్తు బరువును పరిశీలించి ఆహారాన్ని అందించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు తీసుకునే పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. పరిసర ప్రాంతాలను, మంచినీటి సౌకర్యాన్ని, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ సుధారాణి, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

నియోజకవర్గంలోని చదువుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. బుధవారం ఆయనకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ విడుదల చేయాలన్నారు. జివో 77ను రద్దు చేసి ప్రైవేటు పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వాలని, మెస్ చార్జ్ రూ.3వేలకు పెంచాలని, మండల కేంద్రంలో గవర్నమెంట్ జూనియర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయాలని కోరారు.

ఎమ్మెల్యేకు ఎస్ఎఫ్ఐ వినతి

విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.మణి కుమార్, జిల్లా కమిటీ సభ్యులు శివ, కిరణ్, మండల నాయకులు జానీ, మహేష్, తారక్, గజేంద్ర విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

కొత్తవలస మండల కేంద్రంలోని కుమ్మరివీధిలో నివాసం ఉంటున్న ఒక మహిళపై 2023 సంవత్సరంలో దాడికి పాల్పడి, బంగారు వస్తువులను దోపిడి చేసిన ఎల్.కోట మండలం జమ్మాదేవి పేట గ్రామానికి చెందిన నిందితుడు మడబత్తుల కృష్ణ (34)కు విజయనగరం 5వ ఎడిజె జడ్జి ఎన్.పద్మావతి జీవిత ఖైదు, వెయ్యి రూపాయలు జరిమానా విధించినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. కుమ్మరివీధిలో తన కుమారుడితో కలసి నివాసముంటున్న మడబత్తుల సూర్యకాంతం (54) ఇంట్లో 2023 ఏప్రిల్ 15న గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి, ఆమె తలపై కొట్టి, తీవ్రంగా గాయపర్చి, వంటపై కారం జల్లి, మెడలోగల బంగారు పుస్తుల తాడు, చెవిదిద్దులను అపహరించికొని పోయాడు. గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించగా పరిస్థితి విషమించి ఆమె మృతి చెందారు. ఆమె అన్నయ్య సూధా అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు హత్య, దోపిడీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అప్పటి కొత్తవలస సిఐ బాల సూర్యారావు విచారణ చేసి, నిందితుడు మడబత్తుల కృష్ణను అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు. నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం 5వ ఎడిజె ఎన్.పద్మావతి జీవిత ఖైదు విధిస్తూ తీర్పువెల్లడించారు. పోలీసుల తరుపున ఎపిపి గేదెల సత్యం వాదనలు వినిపించారు. నిందితుడికి శిక్షపడేలా చర్యలు చేపట్టిన ఎపిపి, పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ అభినందించారు.

గంజాయి కేసులో 12ఏళ్ల జైలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఎస్.కోట పోలీసు స్టేషనులో 2018లో నమోదైన గంజాయి కేసులో నిందితునికి 12ఏళ్ల జైలు శిక్ష, రూ.1లక్ష జరిమానా విధిస్తూ విజయనగరం 1వ ఎ.డి.జె.జడ్జి ఎం.మీనాదేవి బుధవారం తీర్పు వెల్లడించారు. ఎస్.కోట పోలీసు స్టేషను పరిధిలోని బొడ్డవర చెక్‌పోస్ట్ వద్ద పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో 2018 ఫిబ్రవరి 19న వాహన తనిఖీలు చేపడుతుండగా పోలీసు బొలెరో వ్యాన్ తనిఖీ చేయగా పశ్చిమ బెంగాల్ కు చెందిన సంతు ముజిందార్ (36) ఎ.ఎస్.ఆర్. జిల్లా జి.కె.వీధి మండలం దుప్పలవాడ గ్రామానికి చెందిన పంగి ధనుంజయ్ (24) నిందితులు పట్టుబడ్డారు. వీరి నుంచి 66.2 కిలోల గంజాయిని ఎస్.కోట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి ఎస్.కోట సి.ఐ. వై.రవి కుమార్ నిందితులను రిమాండుకు తరలించి, న్యాయస్థానంలో నిందితులపై అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడు పంగి ధనుంజయ్ 12ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సంతు ముజిందార్ ప్రాసిక్యూషను సమయంలో మరణించారని ఎస్‌పి తెలిపారు. ఈ కేసులో పోలీసువారి తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గేదెల సత్యం వాదనలు వినిపించారు.

522 మద్యం బాటిళ్లు ధ్వంసం

ప్రజాశక్తి - చీపురుపల్లి

వివిధ కేసుల్లో స్వాధీన పర్చుకున్న 522 మద్యం బాటిళ్లను ధ్వంసం చేసినట్లు డిఎస్‌పి రాఘవులు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ జిలా ఎస్‌పి ఆదేశాలతో 2024 ఏడాదిలో 20 కేసులకు సంబంధించి సీజ్ చేసిన మద్యం బాటిళ్లను ధ్వంసం చేశామన్నారు. అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న, విక్రయిస్తున్న వారిపై 2024లో చీపురుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 20 కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసుల్లో వివిధ బ్రాండ్లుకు సంబంధించి మద్యం బాటిళ్లను సీజ్ చేశామని వాటిని ఇప్పుడు ధ్వంసం చేశామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి ఎస్ఐ ఎల్.దామోదర్‌రావు, హెచ్‌సి బి.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మెంటాడ: మండలంలోని గుర్ల గ్రామానికి చెందిన కుమిలి సంతోష్ (36) సోమవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆంద్ర పోలీసులు అందించిన వివరాలు ప్రకారం.. కుటుంబ కలహాలు ఆర్థిక సమస్యల వల్ల మద్యం సేవించి పురుగుల మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆటోపై గజపతినగరం కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అప్పటికే సంతోష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో మృతదేహాన్ని విజయనగరం సర్వజన ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని తండ్రి కుమిలి అప్పారావు ఫిర్యాదు మేరకు ఆంద్ర ఎస్ఐ కె.సీతారాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విజయనగరం రూరల్ మండలంలోని రీమాపేట సమీపంలో బుధవారం విటి అగ్రహారానికి చెందిన సిమ్మ రాము(50) చెట్టును ఢీకొని మృతి చెందారు. తన వృత్తిలో భాగంగా టివిఎస్ ఎక్సెల్ పై ఐసులు అమ్ముకునిన తిరిగి వస్తున్న సమయంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టి అక్కడిక్కకడే మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ వి.అశోక్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

నగరంలోని దాసన్నపేట పరిసర ప్రాంతాల్లో పేకాటాడుతున్న ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ సిఐ టి. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సాయంత్రం దాసన్నపేట పేకాటాడుతున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.2345 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

నోటీసు
మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు
S.O.P. 03/2025

బిట్వీన్:
1. షా మంజుల దేవి, 2. పింకి జైన్, 3. సోను కుమారి జైన్ షా 4. షా కుసుబు, 5. షా నీలిమా కుమారి, 6. షా రాజేంద్ర కుమార్ రాజు ..... పిటిషనర్స్
ఎండ్:
1. జిల్లా కలెక్టర్, విజయనగరం
2. మండల తహశీల్దార్, బొబ్బిలి .....రెస్పాండెంటు

యిందలి పిటిషనర్లు బొబ్బిలి మండలం, బొబ్బిలి గ్రామానికి చెందిన షా విమల్ చంద్ క్లాస్-1 ముఖ్య వారసులమని సదరు షా విమల్ చంద్ కాలం చేసిన నాటికి ఓ.ఎస్ నెం.110/2021 అను దావా డిక్రి అయి వున్నది. సదరు డిక్రీబాకీ రావలసియున్నది. సదరు పిటిషనర్లు మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో S.O.P.03/2025 పిటిషను దాఖలు చేసి, సదరు షా విమల్ చంద్ తాలూకా వారసులకు సక్సెషన్ సర్టిఫికేట్ కోరే నిమిత్తం, సదరు పిటిషను దాఖలు చేసియున్నాము. సదరు క్లయిమ్ మొత్తం పొందుటకు పిటిషనర్లు మాత్రమే ముఖ్య వారసులమని వారసత్వ సర్టిఫికేట్ (సక్సెసన్ సర్టిఫికేట్) కోరుతూ పై కోర్టులో పై పిటిషను దాఖలు చేసినందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం యీపత్రికా ప్రకటన మూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు పిటిషను పై ఎవరికైనా ఎట్టి అక్షేపణలు ఉన్న యెడల <u>**తేది.25-09-2025న ఉ॥ 10.30 గం॥లకు**</u> స్వయంగా లేదావకీలు ద్వారా పై కోర్టులో హాజరై తెలియపరుచు కొనవచ్చును. లేని యెడల పిటిషనరు ముఖ్య వారసులమని నిర్ణయింపబడును.

పై కోర్టు వారి ఆర్డర్ ప్రకారం జారీ చేయడమైనది.

రాయపురెడ్డి ప్రతాప్ కుమార్
అడ్వకేట్, బొబ్బిలి
బొబ్బిలి,
తేది.10-09-2025 సెల్ : 7337244376

ప్రాణం తీసిన అతివేగం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గంట్యాడ మండలం తాటిపూడి గ్రామానికి చెందిన కొయ్యి శ్రీనివాసరావు (24) తన స్నేహితులతో కలిసి బుధవారం తాటిపూడి గ్రామం నుంచి ఎస్ కోట మండలం బొడ్డవర గ్రామం వచ్చి అక్కడ హోటల్లో బిర్యానీ తిన్నాడు. తిరిగి వెళ్లి ప్రయాణంలో మండలంలోని జీడిపాలెం జంక్షన్ వద్దకు వెళ్లేసరికి అక్కడ అకస్మాత్తుగా ఒక గొర్రెల మంద రోడ్డు పైకి వచ్చింది. వేగంగా మోటారు సైకిల్ నడపడం వల్ల అదుపు చేసుకోలేక మందను ఢీ కొట్టి రోడ్డుపై పడిపోయాడు. దీంతో తల వెనుక భాగంలో గాయమైంది. అతన్ని వెంటనే స్థానికులు ఎస్‌కోట సిహెచ్‌సికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం మహారాజ్ హాస్పిటల్‌కి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుని తండ్రి కొయ్యి సన్యాసిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

CHANGE OF NAME

I, KOLLA SUNITHA (New Name), W/o K.V.SAIRAM previously called SUNEETA. ISA (Old Name), Resident of Door No.6-693/A, Mangalavari Colony, Puritipenta (VTC), Gajapathinagaram, Vizianagaram Dist. Now changed my name from SUNEETA. ISA (Old Name) To **KOLLA SUNITHA** (New Name). Hence forth I will be called as **KOLLA SUNITHA** (New Name) for all purpose.

<u>పత్రికా ప్రటకటన</u>
రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి (మొబైల్) కోర్టు, విజయనగరం
దావా నెం : 218/23

Between :
కర్రోతు సూరిబాబు .....వాది
And :
పరాంశుర వెంకట సూర్యనారాయణ...ప్రతివాది

ఇందలి వాది అయిన విజయనగరం జిల్లా, బొండపల్లి మండలం, మరువాడ గ్రామ కాపురస్తుడు కర్రోతు లేటు పైడి నాయుడు కుమారుడు సూరిబాబు.

ఇందలి ప్రతివాది అయిన విజయనగరం అయ్యకొనేరు దక్షిణ గట్టుకు చెందిన పరాంశుర లేటు రామారావు గారి కుమారుడు పరాంశుర వెంకట సూర్యనారాయణపై పై దావాను వేసియున్నారు. విజయనగరం మండలం, ద్వారపూడి గ్రామ రెవెన్యూ సర్వే నెం.264/10,118,12 (స.నెం.11P) లో గల 280 చ॥ గ॥లు అతనికి చెందినవిగా ప్రకటించమని, అలాగే ప్రతివాదిపై ఇంజక్షను ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా కోరుతూ డిక్రీ మంజూరు చేయమని కోరుతూ దావాను వేసియున్నారు.

సదరు దావాలో ప్రతివాదికి కోర్టు నోటీసు అందని కారణంగా ఈ పత్రికా ప్రకటన ప్రత్యామ్నాయంగా నోటీసు ఆదేశించియున్నారు. పై దావా <u>**తేది 24-09-25న**</u> వాయిదా అయి ఉన్నది. కావున ఇందలి ప్రతివాది పరాంశుర వెంకట సూర్యనారాయణ స్వయంగా కాని, న్యాయవాది ద్వారా కాని <u>**ఉదయం 10-30 ని॥ల**</u>కు హాజరు అయి తమ వాదనను వినిపించాల్సిందిగా ఆదేశించడమైనది. లేని పక్షంలో ప్రతివాదికి ప్రతికూలముగా కోర్టువారు తగు నిర్ణయం తీసుకొందురు.

కూరెళ్ళ నాగబూషణరావు
శిరిపురపు సత్యారావు
న్యాయవాదులు, కె.ఎల్.పురం, విజయనగరం.
విజయనగరం
తే 10.9.2025దీ

నేడు మంత్రి లోకేష్ రాక

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని ఎస్ఎంఎస్ పరిశ్రమలోని నూతనంగా జపాన్ టెక్నాలజీతో రూ.250 కోట్లతో నిర్మించిన నూతన బ్లాక్‌ను ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం ప్రారంభిస్తారని ఎస్ఎంఎస్ యజమాని పొట్లూరి రమేష్‌బాబు తెలిపారు. నూతన టెక్నాలజీతో బ్లాక్ ఏర్పాటు చేశామని లోకేష్‌తో దాన్ని ప్రారంభిస్తామని ఉదయం 11 గంటలకు ఆయన వస్తారని చెప్పారు. అనంతరం పబ్లిక్ మీటింగ్ ఉంటుందన్నారు. ఆయనతోపాటు ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే లోకం నాగమధవి, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, మార్క్ఫెడ్ చైర్మన్ బంగారురాజు హాజరవుతారని తెలిపారు. లోకేష్ రాక కోసం హెలిపాడ్ సిద్ధం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

విద్యా సమీక్ష

పూసపాటిరేగ: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం జిల్లా సమగ్ర శిక్షా అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ ఎ. రామారావు నెల్లిమర్ల నియోజకవర్గ స్థాయి విద్యా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిసి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమధవి నియోజకవర్గ పరిధిలోని పాఠశాలలో మౌళిక వసతులు, తరగతి గదుల కొరత తదితర విషయాలపై నివేదిక అడిగినట్లు తెలిపారు. ఈ మేరకు నాలుగు మండలాల విద్యాశాఖ అధికార్లతో సమీక్ష నిర్వహించి ఆయా మండలాల పరిధిలో అదనపు తరగతి భవనాల కొరత, ఇతర మౌళిక వసతులపై నివేదిక తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ నివేదికను ఎమ్మెల్యేకు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో నెల్లిమర్ల, డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ మండలాల విద్యాశాఖ అధికారులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అష్టావధానం

ప్రజాశక్తి - గరివిడి

స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు యం.నిర్మల అధ్యక్షతన బుధవారం అష్టావధానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ విద్యార్థులలో తక్షణ ఆలోచన, భాషా నైపుణ్యం అభివృద్ధి చెందుతుందని, పదప్రయోగం, కవితా రీతులు, చమత్కార సమాధానాలు ద్వారా తెలుగు భాషపై పట్టు బలపడుతుందని చెప్పారు. చదువుని వినోదాత్మకంగా మారుస్తుందని తెలిపారు. అవధానిగా సాహితీ సార్వభౌమ బ్రహ్మశ్రీ కట్టమూరి చంద్రశేఖరం పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. వ్యాఖ్యాతగా పద్మ, సమస్యపూరణంకు దశగ్రంథాల వెంకట సుబ్రహ్మణ్యం, నిశిద్ధాక్షరికు సరిపల్లి సోమేశ్వరరావు, దత్తపదికు ఆవాల యశోదాబాయి, అప్రస్తుత ప్రసంగంకు శ్రీప్రాత రాజేశ్వరరావు, పురాణ పఠనంకు మానాప్రగడ సాహితీ, వర్ణనకు ఎ.సత్య శ్రీనివాసు, వారకథనంకు ఆర్.రామునాయుడు, సంఖ్యా గణనంకు బి.శైలేష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తాటిగూడ పాఠశాల హెచ్ఎం తాడ్డి రామకృష్ణ, ఇతర పాఠశాలల తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా ప్రకటన / హెచ్చరిక నోటీసు

ఇ notice ద్వారా తెలియజేయబడుచున్నది ఏమనగా, శ్రీ పిళ్ల కోటేశ్వరరావు మరియు శ్రీ పిళ్ల గోపీ గారు క్రింద పేర్కొన్న షెడ్యూల్ ఆస్తుల యొక్క ఏకైక యజమానులు మరియు హక్కుదారులు. కొంతమంది తెలియని వ్యక్తులు అక్రమంగా, తప్పుడు పత్రాలు సృష్టించి, ఆస్తిని Survey No. 104/2గా, విస్తీర్ణం 1048 చదరపు గజాలుగా తారుమారు చేసి చూపించారు. ఈ నకిలీ పత్రాల ఆధారంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు 02-08-2025 తేదీన సర్ఫేసి చట్టం సెక్షన్ 8(6) కింద విక్రయ నోటీసు జారీ చేసి, 11-09-2025న వేలం నిర్వహించునని తెలియజేశారు. దీనికి వ్యతిరేకంగా యజమానులు గౌరవనీయ III అదనపు జిల్లా జడ్జి కోర్టు, విజయనగరం ఎదుట O.S. No. 52/2025 దాఖలు చేసి, డాక్యుమెంట్ నెం. 5291/2021 మరియు 5292/2021లను రద్దు చేయవలెనని కోరారు. కేసు విచారణలోనే ఉంది. అదే విధంగా I.A. Nos. 856 & 857/2025 కూడా పెండింగ్లో ఉన్నాయి. తద్వారా, గౌరవనీయ DRT ఎదుట కూడా S.A. No. 512/2025 మరియు అందులో I.A. No. 3399/2025 దాఖలు చేయబడి పెండింగ్లో ఉన్నాయి. కాబట్టి, సాధారణ ప్రజలకు గట్టి హెచ్చరిక ఇస్తున్నాము ఏమనగా, క్రింద షెడ్యూల్ ఆస్తుల విషయంలో ఎలాంటి లావాదేవీలు, ఒప్పందాలు, రిజిస్ట్రేషన్లు జరిపినా, అవి అన్ని పెండింగ్లో ఉన్న న్యాయ ప్రక్రియల ఫలితానికి లోబడి ఉంటాయి మరియు చట్టపరమైన అనర్థాలు కలగవచ్చును.

<u>షెడ్యూల్ ప్రొపర్టీ</u>

<u>**అంశం నెం. 1 :**</u> మొత్తం 968 చద. గజాల్లో భాగమైన 483.33 చద. గజాలు, సర్వే నం. 96/3, డాక్యుమెంట్ నెం. 1437/2019, గాజులరేగ, శ్రీనగర్ కాలనీ, విజయనగరం మునిసిపాలిటీ, విజయనగరం జిల్లా, SRO (West), Vizianagaram పరిధిలో ఉన్న స్థలం.

సరిహద్దులు:
తూర్పు : మాసొంతఖాళీస్థలం
దక్షిణం : రోడ్
పడమర : మాసొంతఖాళీస్థలం
ఉత్తరం : RCC భవనం - మేకల సత్యనారాయణ మరియు ఇతరులకు చెందినది

<u>**అంశం నెం. 2 :**</u> మొత్తం 968 చద. గజాల్లో భాగమైన 483.33 చద. గజాలు, సర్వేనం. 96/3, డాక్యుమెంట్ నెం. 1438/2019, గాజులరేగ, శ్రీనగర్ కాలనీ, విజయనగరం మునిసిపాలిటీ, విజయనగరం జిల్లా, SRO (ఔవర్), Vizianagaram పరిధిలో ఉన్న స్థలం.

సరిహద్దులు:
తూర్పు : మాసొంతఖాళీస్థలం
దక్షిణం : రోడ్
పడమర : మాసొంతఖాళీస్థలం
ఉత్తరం : R.C.C. భవనం - మేకల సత్యనారాయణ మరియు ఇతరులకు చెందినది.

Dr. P. Sarat Babu
ADVOCATE,
Vizianagaram